## క్లుప్తంగా

### సాహితీ ఆణిముత్యం రవీంద్రనాథ్ ఠాగూర్



లక్ష్మీపురం: భారతీయ సాహితీ తేజాన్ని విశ్వ వ్యాప్తం చేసిన మహనీయుడు రవీంద్రనాథ్ ఠాగూర్ అని, మన దేశానికి తొలి నోబుల్ పురస్కారాన్ని అందించిన ఘనత ఆయ నదేనని సీనియర్ గాయకుడు, విశ్రాంత అధికారి డి.వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాల యంలో ఠాగూర్ జయంతి బుధవారం నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రచయితగా, చిత్రకారునిగా, విద్యావేత్తగా గొప్ప మానవతా వాదిగా ఠాగూర్ చరిత్రలో నిలిపోయారన్నారు. సంస్థ కార్యదర్శి కొండాశి వరామిరెడ్డి, సంగీత విద్వాంసుడు పి.మొగిలి మాట్లాడారు.

### మంత్రిపై దాడి హేయమైన చర్య

నెహ్రూనగర్: హోంమంత్రి తానేటి వనితపై దాడి హేయమైన చర్య అని స్వర్ణాంధ్ర ఎమ్మార్పీస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఏసుబాబు మాదిగ పేర్కొన్నారు. బుధవారం కాకాని రోడ్డులోని సంఘ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. తూర్పు గోదావరిలో నల్లజ ర్లలో పర్యటిస్తున్న ఆమెపై కొందరు దాడి చేయడం బాధాకరమన్నారు. ఒక దళిత మహిళపై ఈ విధంగా దాడి చేయడం సిగ్గుచేట న్నారు. దేశంలో అన్ని మారుతున్నాయి కాని దళితులపై దాడులు మాత్రం తగ్గడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

### ల్యాప్‌టాప్ చోరీ

గుంటూరు ఈస్ట్: ల్యాప్‌టాప్ చోరీకి గురైన ఘటనపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. బ్రాడీపేట 4/10వ లైనులోని మానస హాస్టల్‌లో ఎం.కిరణ్‌కు సంబంధించిన ల్యాప్‌టాప్ బుధవారం చోరీకి గురైంది. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### 'నయవంచన' పుస్తకావిష్కరణ



తాడేపల్లిరూరల్: ఆంధ్రప్రదేశ్ పౌర సంఘాల 10 సంవత్సరాల నిరంకుశ పాలనపై రాసిన నయవంచన పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం బుధవారం ఎంటీఎంసీ పరిధిలోని తాడేపల్లిలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి విచ్చేసి నయవంచన పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను ఢిల్లీ నుంచి వచ్చింది ఇండియా కూటమి బలపర్చిన గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి జంగాల అజయ్‌కుమార్, మంగళగిరి ఎమ్మెల్యే అభ్యర్థి జొన్నా శివ శంకరరావు గెలుపు కోసమేనని అన్నారు. మీ అమూల్యమైన ఓటును వీరికి వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరుతున్నట్లు చెప్పారు. దేశంలో ఎక్కడా లేని విధంగా దోపిడీ జరుగుతోందని, మోదీ అధికారంలో ఉన్న నాటి నుంచి నేటి వరకు నిత్యావసర సరకులు, పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు ఆకాశాన్నంటుతున్నాయని అన్నారు. సామాన్యులు బతికే స్థితిలో లేరని అన్నారు. కార్పొరేట్ శక్తులకు ప్రభుత్వ కంపెనీలను దారాదత్తం చేస్తున్నారని విమర్శించారు.

### ఐటీఐలో 10లోగా పేర్లు నమోదు చేసుకోవాలి

తెనాలి రూరల్: ప్రభుత్వ/ప్రైవేటు పారిశ్రామిక శిక్షణసంస్థ(ఐటీఐల్లో) ఆగస్టు 2024 విద్యా సంవత్సరంలో చేరేందుకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు ఈ నెల 10వ తేదీలోగా తమ పేర్లను నమోదు చేయించుకోవాలని తెనాలి ఐటీఐ ప్రిన్సిపాల్, జిల్లా కన్వీనర్ రావి చినవెంకటేశ్వర్లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో లేదా తెనాలి జగ్గడిగుంటపాలెంలోని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణసంస్థ, గుంటూరు ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణసంస్థలలో ఏర్పాటు చేసిన నమోదు కేంద్రాల్లో ఒరిజినల్ సర్టిఫికెట్లతో అభ్యర్థులు పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. పేర్లు నమోదు చేసుకుని, సర్టిఫికెట్‌లు వెరిఫికేషన్ పూర్తి చేయించుక్ను అభ్యర్థులే జూన్ నెలలో జరిగే కౌన్సెలింగ్‌కు అర్హులన్నారు. వివరాలకు 9347795839, 6304572793 సంప్రదించాలని సూచించారు.

### శివాలయంలో అన్నదానం

మంగళగిరి: నగరంలో వేంచేసి ఉన్న శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి ఆలయం (శివాలయం)లో బుధవారం అన్నప్రసాద వితరణ చేశారు. శ్రీ కాశీ అన్నపూర్ణేశ్వరి ట్రస్ట్ ఆధ్వర్యంలో గాయత్రి యజ్ఞం నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు పందేటి సాంబశివరావు, కర్నాటి శివ సత్యనారాయణ, నంగళం ప్రసాద్, జూట్రు ఏడుకొండలు, కఠారి విష్ణుమూర్తి, గూండా రామాంజనేయులు, దుంపలు సోములు పాల్గొన్నారు.

# బ్రాహ్మణులకు ఎల్లప్పుడు అండగా ఉంటాం

**వైఎస్సార్ సీపీ తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి నూరి ఫాతిమా**

నెహ్రూనగర్: గుంటూరు తూర్పు నియోజకవర్గంలోని బ్రాహ్మణులకు ఎల్లప్పుడు అండగా ఉంటామని తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ ముస్తఫా, వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ నూరి ఫాతిమా పేర్కొన్నారు. బుధవారం నియోజవర్గంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో బ్రాహ్మణ నాయకులు ఆళ్లగడ్డ రాము, నాగరాజు ఆధ్వర్యంలో బ్రాహ్మణుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వారు మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలో బ్రాహ్మణులకు అంతా మంచే జరిగింది కాబట్టే నేడు ఎన్నికల ప్రచారాల్లో ఎక్కడ చూసిన బ్రహ్మరథం పడుతున్నారని పేర్కొన్నారు. బ్రాహ్మణులకు వివిధ సంక్షేమ పథకాలు అమలు చేస్తూ బ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పాటు చేసిన ఘతన సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతోందని చెప్పారు.



మాట్లాడుతున్న తూర్పు అసెంబ్లీ అభ్యర్థి నూరిఫాతిమా, ఎమ్మెల్యే ముస్తఫా



ఎన్నికల ప్రచారానికి స్కూటీపై వెళ్తున్న తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి నూరిఫాతిమా



ప్రచారంలో భాగంగా కొబ్బరిబొండాం కొడుతున్న నూరిఫాతిమా

ప్రచార పర్వం

## మురికివాడల్లో ఓటుహక్కుపై అవగాహన

తెనాలి: దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో బుధవారం ఓటరు చైతన్య ప్రచారోద్యమాన్ని తెనాలిలోని పలు మురికివాడల్లో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన తెనాలి సిటీ కో-ఆర్డినేటర్ బి.రాజశేఖర్, ఆయా ప్రదేశాల్లో నివసించేవారికి ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించారు. భారతదేశం ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమని, ఇందుకు డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ రాజ్యాంగమే కారణమని చెప్పారు. ప్రజాస్వామ్య వ్యవస్థకు పునాది ఎన్నికలని గుర్తుచేశారు. విభిన్న భాషలు, మతాలు, కులాలు, సంస్కృతులతో కూడిన సమాజంలో 18 సంవత్సరాలు నిండిన ప్రతి పౌరునికి ఓటు హక్కు కల్పించి రాజకీయ సమానత్వ సాధనకు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పునాది వేశారని చెప్పారు. ఓటు హక్కుతో రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలను ఎన్నుకోవడంలో ప్రజలందరిని ప్రత్యక్షంగా భాగస్వాములను చేశారని చెప్పారు. అంతటి కీలకమైన ఓటును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని చెప్పారు. కో-ఆర్డినేటర్ బి రమేష్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ నచ్చిన వ్యక్తికి ఓటు వేయాలన్నారు. ఓటు వేసేటప్పుడు ఆధార్ కార్డు లేదా ఓటర్ కార్డు వెంట తీసుకువెళ్లాలని సూచించారు. ఓటు ఆవశ్యకతతో కూడిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ.బుజ్జిబాబు , తెనాలి దేవదాసు, సంఘ పెద్దలు పాల్గొన్నారు.



యడ్ల లింగయ్య కాలనీలో కరపత్రాల పంపిణీ

### మలినేనిలో విజయోత్సవ్ - 2024



ప్రత్తిపాడు: వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంటలోని మలినేని మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం విజయోత్సవ్ 2024 పేరుతో ప్లేస్‌మెంట్ డేను నిర్వహించారు. ఇంజినీరింగ్ చివరి సంవత్సరం చదువుతున్న 370 మంది విద్యార్థినులకు వివిధ కంపెనీలలో ఉద్యోగావకాశాలు లభించిన నేపథ్యంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా టుబాకో బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అద్దంకి శ్రీధర్ బాబు హాజరై విద్యార్థులకు సలహాలందించారు. కళాశాల చైర్మన్ మలినేని పెరుమాళ్లుతో కలిసి విద్యార్థులు, వారి తల్లిదండ్రులను సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల ప్లేస్‌మెంట్ డైరెక్టర్ డాక్టర్ కె. శ్వేత, ప్రిన్సిపాల్ అప్పారావు పాల్గొన్నారు.

### పాలిసెట్‌లో మెరిసిన తెనాలి తేజం

తెనాలి రూరల్: పాలిసెట్ ఫలితాల్లో తెనాలి విద్యార్థి ప్రతిభ చాటాడు. బుధవారం విడుదలైన ఫలితాల్లో పట్టణానికి చెందిన కొడవటిగంటి వెంకట అనంత కార్తికేయ 267వ ర్యాంకు సాధించాడు. కార్తికేయ పదో తరగతిలో 565 మార్కులు సాధించాడు. విద్యలో రాణిస్తున్న ఇతను గత నెల 27వ తేదీన జరిగిన పాలిసెట్ పరీక్షకు హాజరయ్యాడు. 267వ ర్యాంకుతో జిల్లాలోనే ప్రథమ స్థానంలో నిలిచినట్టు తెలుస్తోంది.

## ప్రాథమికంగా గుర్తిస్తే..

# అన్నవాహిక క్యాన్సర్ నివారణ

- తరచుగా త్రేపులు, ఛాతిలో మంట ఉంటే క్యాన్సర్ సంకేతం
- గుంటూరు జీజీహెచ్‌లో ఉచితంగా కార్పొరేట్ వైద్యం






అన్నవాహిక క్యాన్సర్ పోస్టర్లు

గుంటూరు మెడికల్: గుంటూరు శ్రీనగర్‌కు చెందిన సతీష్ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. నిర్ణీత వేళల్లో భోజనం చేయకుండా తరచుగా రెస్టారెంట్స్‌లో ఫాస్ట్ పుడ్స్ తింటున్నాడు. దీంతో అన్నం జీర్ణం కాకపోవటం, తరచుగా పుల్లటి త్రేపులు, ఛాతిలో మంట సమస్యలతో గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్యులను సంప్రదించాడు. వైద్యులు పరీక్షలు చేసి అతడికి అన్నవాహిక క్యాన్సర్ సోకినట్లు నిర్ధారించటంతో భయాందోళనలకు గురయ్యాడు. ఇలా ఎంతో మంది ఆధునిక జీవనశైలి వల్ల అన్నవాహిక క్యాన్సర్ వ్యాధుల బారిన పడుతున్నారని జీర్ణకోశవ్యాధి వైద్యనిపుణులు తెలియజేస్తున్నారు. అన్నవాహిక క్యాన్సర్‌పై అవగాహన కల్గి ఉండే వ్యాధి బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తపడొచ్చు. ఈ సందర్భంగా 'సాక్షి' అందిస్తున్న ప్రత్యేక కథనం.

**లక్షణాలు**

అన్నవాహిక క్యాన్సర్ సోకిన వారికి ఆహారం మింగడంలో ఇబ్బంది ఉంటుంది. ఆకలి సరిగా ఉండదు. ఆహారం మింగే సమయంలో గొంతులో, ఛాతిలో నొప్పి వస్తుంది. తిన్న ఆహారం జీర్ణం కాకపోవటం ద్వారా గుండెలో మంట, అలసట, ఆయాసం వంటి లక్షణాలు కనిపిస్తాయి. అకస్మాత్తుగా బరువు తగ్గిపోవడం, స్వరంలో మార్పు రావడం, దీర్ఘకాలికంగా దగ్గు ఉండటం వంటి లక్షణాలు కనిపిస్తాయి.

**కారణాలు**

ధూమపానం, మద్యపానం చేసే వారికి ఎక్కువగా అన్నవాహిక క్యాన్సర్ సోకుతుంది. కట్టెల పొయ్యలపై, ఐరన్ గ్రిల్స్‌పై కాల్చిన ఆహారం తినటం వల్ల, ఫాస్ట్ పుడ్స్ ఎక్కువగా తినటం వల్ల, అన్నవాహిక పొరల్లో వాపు వల్ల క్యాన్సర్ సోకుతుంది. జన్యుపరమైన కారణాలు, కుటుంబంలో ఒకరికి ఈ క్యాన్సర్ సోకితే ఇతరులకు కూడా సోకే ప్రమాదం ఉంది. ఎక్కువగా 40 నుంచి 60 ఏళ్ల వయస్సు వారు అన్నవాహిక క్యాన్సర్ బారిన పడుతున్నారు. స్త్రీలలో కంటే పురుషుల్లో ఈ వ్యాధి బాధితులు ఎక్కువగా ఉన్నారు.

**జిల్లాలో బాధితులు**

గుంటూరు జీజీహెచ్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్య విభాగంలో ప్రతి నెలా 600 మందికిపైగా వివిధ రకాల సమస్యలో చికిత్స కోసం వస్తున్నారు. వీరిలో కొత్తగా 25 మంది వరకు అన్నవాహిక క్యాన్సర్ బాధితులు ఉంటున్నారని గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్యులు తెలిపారు. జీజీహెచ్ క్యాన్సర్ వైద్య విభాగంలో ప్రతినెలా వెయ్యి మంది వరకు వివిధ రకాల క్యాన్సర్‌లో చికిత్స కోసం వస్తుండగా వీరిలో ప్రతినెలా 15 మంది వరకు అన్నవాహిక క్యాన్సర్ బాధితులే ఉంటున్నారు.

**వ్యాధి నిర్ధారణ**

ఎండోస్కోపీ, సీటీ స్కాన్, ఎంఆర్ఐ స్కాన్, పెట్ స్కాన్, బయాప్సీ, బేరియం స్వాలో పరీక్ష ద్వారా క్యాన్సర్‌ను నిర్ధారిస్తారు.

### నాట్కో క్యాన్సర్ సెంటర్‌లో ఉచిత వైద్యం



గుంటూరు జీజీహెచ్ నాట్కో క్యాన్సర్ సెంటర్‌లో అన్ని రకాల క్యాన్సర్‌లకు కార్పొరేట్ ఆసుపత్రుల కంటే ధీటుగా అంతర్జాతీయ ప్రమాణాలతో ఉచిత వైద్య సేవలు అందిస్తున్నాం. క్యాన్సర్ బాధితులకు సర్జికల్, మెడికల్, రేడియో థెరపీ, కీమోథెరపీ వైద్య సేవలు లభిస్తున్నాయి. క్యాన్సర్ రోగులకు ఉచితంగా ఆపరేషన్లు చేయడంతోపాటు, మందులు కూడా ఉచితంగా అందజేస్తున్నాం.

– యడ్లపాటి అశోక్‌కుమార్, నాట్కో సెంటర్ సమన్వయకర్త.

### అలవాట్లలో మార్పులు చేసుకోవాలి



తరచుగా తేపులు, ఛాతిలో మంట వచ్చే వారు ఏ మాత్రం ఆలస్యం చేయకుండా గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్యులను సంప్రదించాలి. క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షల్లో భాగంగా ప్రాథమిక దశలోనే గుర్తించేందుకు జెనెటిక్ టెస్ట్, ఎండోస్కోపీ పరీక్షలు చేయించుకోవాలి. ప్రాథమిక దశలోనే గుర్తిస్తే పూర్తిగా నయం చేయవచ్చు. నిర్ణీత వేళల్లో ఆహారం తీసుకోవాలి. రాత్రి వేళల్లో 8 గంటల కల్లా భోజనం చేయాలి. మద్యపానం, ధూమపానానికి దూరంగా ఉండాలి. స్మోక్‌డు పుడ్‌ను, ఫాస్ట్‌పుడ్‌ను తీసుకోకూడదు.

– డాక్టర్ షేక్ నాగూర్ బాషా, గ్యాస్ట్రోఎంట్రాలజిస్ట్, గుంటూరు.

### ప్రాథమిక దశలో గుర్తిస్తే చికిత్స సులువు



ఎసోఫాగియల్ (అన్నవాహిక క్యాన్సర్) క్యాన్సర్‌ను ప్రాథమిక దశలోనే గుర్తిస్తే నివారించవచ్చు. స్త్రీలకంటే పురుషుల్లో ఈ క్యాన్సర్ ఎక్కువగా వస్తుంది. క్యాన్సర్‌లను ప్రాథమిక దశలోనే గుర్తించే ఆధునిక చికిత్స పద్ధతులు నేడు అందుబాటులో ఉన్నాయి. తరచూగా గుండెలో మంట ఉంటే ఏమాత్రం ఆలస్యం చేయకుండా వైద్య నిపుణులను సంప్రదించాలి.

– డాక్టర్ బైరపనేని స్రవంతి, క్యాన్సర్ వైద్య నిపుణురాలు.

# తూర్పులో 2,714 పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్



ఓటింగ్ ప్రక్రియను పరిశీలిస్తున్న తూర్పు ఆర్ ఓ కీర్తి చేకూరి

నెహ్రూ నగర్: ఎన్నికల విధులు కేటాయించబడిన ఉద్యోగులు తూర్పు నియోజకవర్గంలో పోస్టల్ బ్యాలెట్‌ని 2,714 మంది వినియోగించుకున్నారని నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కీర్తి చేకూరి తెలిపారు. ప్రస్తుత సార్వత్రిక ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కుని వినియోగించుకోవడానికి అనువుగా ఏసీ కాలేజి ఫెసిలిటేషన్ సెంటర్‌లో తగిన ఏర్పాట్లు చేశామన్నారు. బుధవారం ఇతర నియోజకవర్గాలతో కలపి 669 మంది పోస్టల్ బ్యాలెట్‌ని వినియోగించుకున్నారని వెల్లడించారు. గుంటూరు తూర్పు నియోజకవర్గానికి సంబంధించి పోస్టల్ బ్యాలెట్‌ని ఈ నెల 5 నుంచి 8వ తేదీ వరకు 2,714 మంది తమ ఓటుని వినియోగించుకున్నారన్నారు. ఎన్నికల విధుల్లో ఉండి బుధవారం వరకు పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోని వారికి ఎన్నికల కమిషన్ గురువారం పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోవడానికి అవకాశం కల్పించారని తెలిపారు.

## హోంమంత్రి తానేటి వనితపై దాడి అప్రజాస్వామికం



సమావేశంలో మాట్లాడుతున్న జీవా

నెహ్రూనగర్: హోంమంత్రి తానేటి వనితపై దాడి అప్రజాస్వామికమని మాదిగ లాయర్స్ అసోసియేషన్ రాష్ట్ర పుసులూరి జీవా పేర్కొన్నారు. బుధవారం నగరంపాలెంలో విలేకరులతో మాట్లాడారు. ఎన్‌డీఏ కూటమికి, చంద్రబాబుకు మాదిగలంటే ఎంత ప్రేమో అర్థమౌతుందన్నారు. కూటమి నేతలు పలు రకాలుగా మాదిగలను ఇబ్బందులకు గురిచేస్తుంటే మందకృష్ణ మాదిగ దీనికి ఏ సమాధానం చెప్తారని ప్రశ్నించారు. అసలు మందకృష్ణకు మాదిగలు రాజకీయ బానిసలుగా ఉండాలని, ఏ మాదిగ అయిన ఎమ్మార్పీస్ నుంచి అసెంబ్లీకి పంపే ప్రయత్నం చేశావా అని ప్రశ్నించారు. నీకు ఎటువంటి స్వార్థం లేకపోతే ఎమ్మార్పీస్ తరుపున ఎమ్మెల్యే సీట్లు కేటాయించాలని అడిగివాడేవని.. కాని నీ స్వలాభం కోసం ఎమ్మార్పీస్‌ను ఎన్‌డీఏ కూటమికి తాకట్టు పెట్టావని మండిపడ్డారు. కూటమి ఆధ్వర్యంలో తెలుగుదేశం అధికారంలోకి రాకముందే రాష్ట్ర హోంమంత్రిపైనే దాడి జరిగితే.. ఇక అధికారం వస్తే సామాన్య మానవుడి పరిస్థితి ఏ విధంగా ఉంటుందో అర్థం చేసుకోవచ్చొన్నారు. ఆయన వెంట అసోసియేషన్ నాయకులు రాయపాటి రత్నం పాల్గొన్నారు.

## సత్యానికి ధర్మానికి నిదర్శనమే శ్రీరామచంద్రుడు



ప్రసంగిస్తున్న కోటేశ్వరరావు

నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై మూడు రోజులపాటు నిర్వహించిన 'సంక్షిప్త రామాయణం' ధారావాహిక ప్రవచనం బుధవారంతో ముగిసింది. ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచకులు కేవీ కోటేశ్వరరావు ప్రసంగిస్తూ నారదుల వారు వాల్మీకి మహామునికి వంద శ్లోకాలతో అందించినదే సంక్షిప్త రామాయణం అన్నారు. మానవుడు నిత్యం వేదాధ్యానం చేయాలన్నారు. తద్వారా పొందిన జ్ఞానాన్ని ముందు తరాలకు అందించాలని పేర్కొన్నారు. మానవుడు శ్రీరాముని ఆదర్శంగా తీసుకుని సత్యం, ధర్మం, తల్లిదండ్రుల సేవలను విధిగా పాటించాలని చెప్పారు. సత్యం, ధర్మం ఆచరించడం వల్ల ధనం, సుఖం, జ్ఞానం కలిగి మానవుడు ఆనందంగా జీవిస్తారని పేర్కొన్నారు. శ్రీరాముడు అరణ్య వాసంలో అనేక విషయాలకు ఆదర్శంగా ఉన్నారని చెప్పారు. తొలుత కార్యక్రమాన్ని ఆలయ పాలక మండలి సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు, సుందర సత్సంగ్ సభ్యులు జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. కార్యక్రమంలో మన్నవ రవి ప్రసాద్, పి.శివారెడ్డి, సాంబశివరావు, మురికిపూడి లక్ష్మీసత్యనారాయణ పాల్గొనగా, కేవీ కోటేశ్వరరావుని దేవాలయ పాలకవర్గం సత్కరించారు.

## నాగ మల్లేశ్వరరావు చిరస్మరణీయుడు



నాగమల్లేశ్వరరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న యూటీఎఫ్ నాయకులు

గుంటూరు ఎడ్యుకేషన్: ఉపాధ్యాయుడిగా అభ్యుదయ భావాలను కలిగిన నాగ మల్లేశ్వరరావు లోటు తీరనిదని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.ఆదిలక్ష్మి, ఎం.కళాధర్ పేర్కొన్నారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడిగా, రాష్ట్ర కార్యదర్శిగా పని చేసి కోవిడ్‌తో మృతి చెందిన కె.నాగ మల్లేశ్వరరావు తృతీయ వర్ధంతిని బుధవారం బ్రాడీపేటలోని సంఘ జిల్లా కార్యాలయంలో నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే అభ్యుదయ భావాలను పుణికిపుచ్చుకున్న మల్లేశ్వరరావు ఉపాధ్యాయ ఉద్యమంలోనూ నిబద్ధతతో పని చేశారని కొనియాడారు. స్థానిక, జాతీయ, అంతర్జాతీయ ఆర్థిక, రాజకీయ విధానాలను అధ్యయనం చేసి, తోటివారిని చైతన్యవంతులుగా తీర్చిదిద్దారని తెలిపారు. యూటీఎఫ్ రాష్ట్ర ప్రచురణల కమిటీ చైర్మన్ ఎం.హనుమంతరావు మాట్లాడుతూ నాగమల్లేశ్వరరావును ఆదర్శంగా తీసుకుని పని చేయడమే అసలైన నివాళి అని అన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు జి.వెంకటేశ్వర్లు, సీహెచ్ ఆదినారాయణ, జి.వెంకటేశ్వరరావు, ఎం.గోవిందయ్య, కె.ప్రేమ్‌కుమార్, ఎండీ షకీలాబేగం, శివరామిరెడ్డి, ఆదంసాహెబ్, ధనలక్ష్మి, బాజీబాబా, గోపయ్య, శ్రీనివాస్, కార్తీక్, రమణ పాల్గొన్నారు.

## కారు ఢీకొని యువకుడి దుర్మరణం



ప్రమాదానికి కారణమైన కారు ఇదే

తాడేపల్లిరూరల్ : మంగళగిరి-తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని పాత జాతీయ రహదారి వెంబడి పోలకంపాడు హెచ్‌పీ పెట్రోల్ బంక్ సమీపంలో ఓ కారు అతివేగంగా వచ్చి ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తున్న ఓ యువకుడ్ని ఢీ కొట్టింది. ఆ యువకుడికి తీవ్ర గాయాలు కాగా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యంలోనే మృతి చెందాడు. బుధవారం జరిగిన ఈ సంఘటనలో ఎస్ఐ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం విజయవాడ నుంచి మంగళగిరి వెళ్తున్న కారు పోలకంపాడు హెచ్‌పీ పెట్రోల్ బంక్ సమీపంలో ఓ ఆటోను క్రాస్ చేస్తూ ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తున్న విజయవాడకు చెందిన పిల్లి రాజు (32)ను కారు గుద్దడంతో పది అడుగుల పైకి లేచి కారు అద్దంపై పడ్డాడు.ఈ ప్రమాదంలో తలకు తీవ్ర గాయమైంది. విజయవాడలో నివసిస్తూ ఇబ్రహీంపట్నం పవర్‌ప్లాంట్‌లో కాంట్రాక్ట్ కార్మికుడిగా పనిచేస్తున్న పిల్లి రాజు తాడేపల్లి ఆర్ఎంఎస్ కాలనీలో అత్తగారి ఇంటి దగ్గర నుంచి విజయవాడ వెళ్తున్న సమయంలో ఈ ప్రమాదం జరిగింది. కారుపై పడి తీవ్ర గాయమైన పిల్లిరాజును స్థానికులు ఆటోలో తాడేపల్లిలోని ఓ కార్పొరేట్ ఆసుపత్రికి తీసుకువెళ్లగా అప్పటికే మృతి చెందాడని వైద్యులు తెలిపారు. భార్య శ్రావణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమేష్ తెలిపారు. ఇదిలా ఉండగా ప్రమాదం జరిగిన సమయంలో కారులో ఉన్న వ్యక్తులు అక్కడ ఉన్న వారిని ఎవరినీ కారు వద్దకు రాకుండా జాగ్రత్తలు తీసుకుని కారుకు ఉన్న నెంబరు ప్లేట్లు తొలగించి అక్కడి నుంచి పరారయ్యారు. పోలీసులు తమదైన శైలిలో విచారణ చేపట్టి కారు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.

## సాధారణ ప్రసవాలు అయ్యేలా చూడాలి

గుంటూరు మెడికల్: ప్రైవేటు ఆస్పత్రుల్లో నూరు శాతం సిజేరియన్‌లు చేసిన వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాధారణ కాన్పులు కంటే సిజేరియన్లు ఎక్కువగా చేస్తున్నారని, ప్రైవేటు ఆస్పత్రులపై ఫిర్యాదులు రావడంతో కమిషనర్ ఆదేశాలు జారీ చేశారన్నారు. ఎక్కువ శాతం సిజేరియన్లు చేసిన ప్రైవేటు ఆస్పత్రులను సందర్శించి ఆపరేషన్లు చేయడానికి గల కారణాలు సమీక్షించి నోటీసులు అందజేస్తామన్నారు. సాధ్యమైనంత మేరకు ప్రసవాలు ఆపరేషన్‌లతో పనిలేకుండా నార్మల్‌గా అయ్యేలా చూడాలన్నారు.

### పోలింగ్ కేంద్రాల పరిశీలన

గుంటూరు రూరల్: ప్రత్తిపాడు నియోజకవర్గ సమస్యాత్మక గ్రామం బుడంపాడులోని పోలింగ్ కేంద్రాన్ని జిల్లా ఎస్పీ తుషార్ డూడి బుధవారం పరిశీలించారు. కేంద్రంలో తీసుకోవాల్సిన భద్రతా చర్యలను, బందోబస్తుకు సంభందించిన విషయాలను అధికారులకు వివరించారు.